
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
సోమవారం 17 జూన్ 2024

వైసీపీ నేతలతో అంటకాగిన అధికారుల్లో గుబులు నెలకొంది. తాము ప్రభుత్వ ఉద్యోగులమని మరిచిపోయి.. ఐదేళ్లకొకసారి మారిపోయే రాజకీయ నాయకుల మాటలు విని నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నారు. వైఎస్ జగన్ అండ్ కో సొంత సామ్రాజ్యమని భావించి వారికి ఊడిగం చేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారిపోవడంతో అధికారులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. అధికారంలో ఉన్నప్పుడు పంపిన వైసీపీ సిఫారసులను మాయం చేసేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీకి కొమ్ము కాసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎలా టెన్షన్ పడుతున్నారో.. ఇప్పుడు జిల్లాలో కూడా వైసీపీకి కొమ్ముకాసిన అధికారులు అదేస్థాయిలో ఆందోళన చెందుతున్నారు. యథాస్థానంలో ఉండేందుకు కొందరు పైరవీలు చేసి టీడీపీ ఎమ్మెల్యేలతో టచ్‌లోకి వెళ్లగా.. మరికొందరు మాత్రం తమకు బదిలీ వేటు తప్పదని డిసైడ్ అయిపోయారు.



# 'వైసీపీ' అధికారుల్లో గుబులు

- టీడీపీ ఎమ్మెల్యేలతో టచ్‌లోకి కొందరు
- ఇక్కడే ఉండేందుకు పైరవీలు
- బదిలీ వేటు తప్పదని కొందరు డిసైడ్
- వైసీపీ సిఫారసులను మాయం చేసే యత్నం



(కడప-ఆంధ్రజ్యోతి): ఎంపీ, ఎమ్మెల్యే, సర్పంచ్‌ను జనం తమ ఓటు హక్కుతో ఐదేళ్ల కాలానికే ఎన్నుకుంటారు. ఆ పాలనలో సుపరిపాలన, అభివృద్ధి, సంక్షేమం, ప్రజలతో మమేకం కాకపోవడం.. ఇలా ఎందులోనైనా సరే ఓటర్ల అభీష్టానికి వ్యతిరేకంగా పాలిస్తే ఐదేళ్లు తిరిగేసరికి మళ్లీ ముందున్న స్థానంలో కూర్చోబెడతారు. 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ 151 స్థానాలు గెలిచి పాలిటిక్స్‌లోనే చరిత్ర సృష్టించింది. అయితే మళ్లీ ఐదేళ్లకు (2024 ఎన్నికల్లో) గతంలో వచ్చిన 151 స్థానాల మధ్యలో నుంచి 5 పీకేసి 11 సీట్లు మాత్రమే కట్టబెట్టారు. ఇదీ రాజకీయ నాయకుని భవితవ్యం. మరి ప్రభుత్వ ఉద్యోగి విషయానికొస్తే... ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఎంతనుకున్నా కనీసం 30 సంవత్సరాలు సర్వీసు ఉంటుంది. రాజకీయ నాయకుడు తప్పు చేస్తే ఐదేళ్లకే ఇంటికి పంపిస్తారు. అలాంటి నేతల మాటలు విని కొందరు ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకున్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారిపోవడంతో అధికారుల్లో గుబులు మొదలైంది.

జిల్లాలో కొందరు అధికారులు ఇది ప్రభుత్వశాఖ అని మరిచిపోయి వైసీపీ కార్యాలయాలుగా మార్చారనే విమర్శ ఉంది. కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వరకు అన్ని చోట్ల వివక్షే. ముఖ్యంగా జిల్లా అధికార యంత్రాంగమంతా పులివెందులకు గులాం చేసిందనే అభియోగాలు ఉన్నాయి. కీలక అధికారే పులివెందులకు దాసోహమై ప్రతిపక్ష నేతలను పక్కనబెట్టారంటారు. అయితే ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఎప్పుడైతే వైసీపీ పోతుందని తెలియగానే ఆ కీలక అధికారి టీడీపీని ప్రసన్నం చేసుకుంటుండడం గమనార్హం. నిన్నటిదాకా ఎవరి దయతో అయితే జిల్లాలో పనిచేశారో వారినే పక్కనబెట్టడం చూసి ఔరా.. ఇతనికా మనం ఇంత ప్రియార్టీ ఇచ్చింది అంటూ వైసీపీ నేతలే తలగోక్కోవడం హాట్‌టాపిక్‌గా మారింది.

### వైసీపీతో అంటకాగారు

ఇంత వరకు ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీలు పాలించాయి. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ పాలనలో కొందరు అధికారులు వైసీపీకి కట్టుబానిసలుగా మారారన్న విమర్శ ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ కీలక అధికారే వైసీపీకి భజన చేయడంతో మిగతా అధికారులు కూడా అదే బాట పట్టారంటారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వీరంతా జనం కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటుండడం మరిచిపోయి... జగన్ పాలనలో ఆ పార్టీ ఇచ్చే సొమ్ముతో జీతాలు తీసుకుంటున్నామనే మైకంలో ఉండి ఆ పార్టీకి భజన చేశారంటారు. 2019-24కాలంలో జిల్లాలో వైసీపీ ఆకృత్యాలకు అడ్డే లేదు. దాడులు, భూ కబ్జాలు, బెదిరింపులు ఇలా ఒకటేంటి అన్నింటిపై ఈ దాష్టీకం, ఇక పథకాల్లో కూడా వైసీపీకి ప్రియార్టీ. తమకు అన్యాయాలను చెప్పుకునేందుకు అటు ప్రతిపక్షాలు, జనం వెళ్లినా కూడా వినే నాథుడు లేరు. ఎందుకంటే జగన్ పాలనలో అప్పట్లో దాసోహం. జిల్లాలో కీలక అధికారులే వారి స్థాయి, వారు చదివిన చదువు, కుటుంబ నేపథ్యం మరిచిపోయి కేవలం వైసీపీ బ్రాండ్ పేరు తగిలించుకున్న వారిని చూసి అవాక్కయ్యారు. జిల్లా యంత్రాంగాన్ని ఇద్దరు కీలక నేతలే భ్రష్టు పట్టించారంటారు. అందుకే అటు రెవెన్యూ ఇటు పోలీసు యంత్రాంగం ఇలా అధికార యంత్రాంగామంతా వైసీపీకి తాకట్టు పెట్టారంటారు. ఇదే అదనుగా కొందరు అధికారులు చిలక్కొట్టుడుకు తెరలేపి అక్రమార్జనకు పాల్పడ్డారనే విమర్శ ఉంది.

### వైసీపీ పునరావాస కేంద్రంగా డ్వామా

డ్వామా.. ఇది గ్రామీణప్రాంతాలకు కీలకమైన శాఖ. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పిస్తారు. వ్యవసాయ కూలీలే కాదు. అర్హులైన రైతులకు పండ్ల తోటలు, నీటి సంరక్షణ పనులు, పర్యావరణ కోసం మొక్కల పెంపకం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేందుకు చర్యలు, పండ్లతోటల పెంపకం, ఇవే కాదు పల్లెల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ, శ్మశాన రహదారులు, కాంపౌండ్లు, పల్లెల్లో పొలాలకు రోడ్లు ఇలా ఒకటేంటి పల్లెల్లో సమస్తం ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి చేసుకోవచ్చు. దీన్నే 2014-19 టీడీపీ హయాంలో అప్పటి గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ ఆచరణలో చూపించారు. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో జరిగే సమస్తం అభివృద్ధి పనులన్నీ ఉపాధి హామీ ద్వారా చేసేవారు. అయితే జగన్ సీఎం అయిన తరువాత కడప జిల్లా డ్వామా కార్యాలయాన్ని కేవలం వైసీపీ నేతల పునరావాస కేంద్రంగా మార్చారంటారు. పీడీ యధుభూషణ్‌రెడ్డి వైఎస్ జగన్‌కు అనుకూలురనే ముద్ర ఉంది. ఈయన పదవీ విరమణ టైం ఎప్పుడో పూర్తయింది. అయితే ఆయన వైసీపీకి బంటు కావడంతో మళ్లీ మళ్లీ పొడిగించారనే విమర్శ ఉంది. ఓ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధితో డ్వామాలో ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు ఇచ్చారని చెబుతారు. పులివెందుల సిఫారసు వస్తే చాలు డ్వామా అధికారులంతా అటెన్షన్‌లో ఉండి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలిచ్చారంటారు. కేవలం పులివెందుల సిఫార్సుతోనే 40 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చారంటారు. సాధారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతరత్రా నియామకాలు పదోన్నతుల్లో నిబంధనలు పాటిస్తారంటారు. అయితే యదుభూషణ్‌రెడ్డి వచ్చిన తరువాత అవన్నీ పక్కనబెట్టి

ఎంపీ అవినాశ్ రెడ్డి లెటరు ఉంటే చాలు.. అన్నీ ఒకే చేశారంటారు. డ్వామాను కేవలం వైసీపీ కార్యాలయంగా మార్చారనే విమర్శ ఉంది. జగన్ పాలనలో ఏ విషయంలో కూడా నిబంధనలు పాటించలేదంటారు.

ఓ కీలక శాఖలో ఓ మహిళ షాడో అధికారిగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. హెచ్‌ఆర్ మేనేజరును ఇన్‌చార్జ్‌గా నియమించాలంటే దానికో అర్హతలు ఉన్నాయి. అటు సీనియారిటీ, విద్యార్హత ఇవన్నీ. అయితే నిన్నటిదాకా స్టేట్‌లో కీరోల్ చేసిన అధికారి, జిల్లా అధికారి పేరు చెప్పుకుని ఆమె అడ్డంగా పదవి పొందినట్లు చెబుతారు. పోనీ అర్హత లేకున్నా సరే బాధ్యతలు తీసుకున్నప్పటికీ.. న్యాయం చేయకుండా కేవలం కొందరిని టార్గెట్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తుంటారు. హెచ్‌ఆర్ కోసం గతంలో పనిచేసిన కొందరు హెచ్‌ఆర్ అవకాశం తమకు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా మీరు అనర్హులంటూ అమరావతి స్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే అప్పుడు దరఖాస్తు చేసుకున్న అధికారులు ఉన్నా తక్కువ కేడరు వారికి బాధ్యతలు ఇవ్వడం దుమారం రేపుతుంది. డ్వామాలో ఇప్పుడు ఈ విషయం కలకలం రేపుతుంది.

### అధికారులు గులాం

వైసీపీ పాలనలో టీడీపీ టార్గెట్‌గా పనిచేశారంటారు. కడప డీఎస్పీపై కూడా వైసీపీ అనుకూలురని టీడీపీ ఆరోపిస్తుంది. ఇక విజిలెన్స్‌గా పనిచేసే ఓ అధికారిపై కూడా ఆరోపణలున్నాయి. ఆ అధికారి మళ్లీ ఇక్కడే కొనసాగేందుకు లాబీయింగ్ చేస్తున్నారంటారు. ఇక పాడా అనేది పేరుకు పులివెందుల డెవలప్‌మెంటు అభివృద్ధి సంస్థ. పులివెందుల అభివృద్ధి పక్కనపెట్టి దాని ద్వారా అటు అధికారులు వైసీపీ నేతలు బాగుపడ్డారంటారు. పాడాలో జరిగిన అవినీతి గురించి కనీసం సమాచారం కూ డా ఇవ్వకుండా అధికారులు పులివెందుల బ్యాచ్‌కు గులాం చేశారనే విమర్శ ఉంది. ఇక జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, డీపీ వో ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, పాడా అధికారి అనిల్‌కుమార్‌రెడ్డిపై విమర్శలున్నాయి. వీళ్లలో కొందరు అధికారులు కనీస నిబంధనలు వదిలేసి జగన్‌కు భజన చే యడమే విమర్శలకు తావిస్తోంది. మళ్లీ వైసీపీనే అధికారంలో కి వస్తుందనుకుని కొందరు అధికారులు తమ సీనియార్టీని వదలిపెట్టి మరీ కాసుల కక్కుర్తికి జగన్‌భజన చేశారు. అయి తే జనం ఊహించని విధంగా ట్రీట్‌మెంటు ఇచ్చారు. ఇప్పుడు పాత తప్పుల నుంచి బయటపడేందుకు.. ఇక్కడే ఉండేందుకు టీడీపీ నేతల ప్రదక్షిణ చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వారు చెప్పారు.. మేం చేశాం, మమ్మల్ని వదిలేయండి, ఇక నుంచి మీరు చెప్పిందే చేస్తాం అంటూ ఎమ్మెల్యేలకు చెబుతుండడం చూసి అవాక్కవుతున్నారు.

---

## ఆర్‌జేడీ అధికార దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

- విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఫిర్యాదు

కడప(ఎర్రముక్కపల్లె), జూన్ 16: కడప ఆర్‌జేడీగా పనిచేస్తున్న వై.రాఘవరెడ్డి చేసిన అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేశ్‌కు శనివారం ఆయన ఫిర్యాదు చేశారు. ఆర్‌జేడీ రాఘవరెడ్డి కడప డీఈవోగా చాలా కాలం పనిచేశారని, ఆ సమయంలో వైసీపీకి అనుకూలంగా ఉంటూ ఇష్టానుసారంగా బదిలీలు చేశారని ఆరోపించారు. అలాగే ఉపాధ్యాయులను దూషించడం, మహిళా టీచర్లతో అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించకున్నా వాటికి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో ఇవ్వని విధంగా టీచర్లు నిరసనలు చేయరాదని ఉత్తర్వులు కూడా ఇచ్చారన్నారు. 2023 మార్చిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేశారని, తాను ఎమ్మెల్సీ అయిన తరువాత దీనిపై ఫిర్యాదు చేస్తే ప్రతిగా ప్రెస్‌మీట్లు పెట్టి తన అంతు తేలుస్తానంటూ బెదిరించారని విమర్శించారు. కలెక్టరు, రాష్ట్ర గవర్నరును కలిసి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖలో అక్రమాలపై విచారణ జరిపించి కఠినంగా శిక్షించాలని లోకేశ్‌ను కోరారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన డీఈవో అనురాధపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రి లోకేశ్‌ను కోరారు. గత కొన్ని నెలల క్రితం నంద్యాల జిల్లా నుంచి డీఈవోగా అనురాధ ఇక్కడికి బదిలీ అయ్యారని తెలిపారు.

## జగనన్న ఇళ్లపై విచారణ చేయాలి

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందులటౌన్, జూన్ 16: పులివెందుల మున్సిపాలిటీలో జగనన్న గృహనిర్మాణ పథకం కింద మంజూరు చేసిన 8 వేల ఇళ్లపై విచారణ జరపాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. జగనన్న లేఅవుట్‌లో అనర్హులకు, ధనవంతులకు, ఇతర ప్రాంతాల వారికి, ఉద్యోగులకు ఇళ్లను మంజూరు చేశారని, అనేక ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించలేదని తెలిపారు. ఇళ్ల మంజూరు కుంభకోణంలో కీలకపాత్ర వహించిన అప్పటి జాయింట్ కలెక్టర్, పులివెందుల మున్సిపల్ కమిషనర్, ఇతర బాధ్యులపై విచారణ జరిపి నకిలీ లబ్ధిదారులపై చర్యలు తీసుకోవాలని చంద్రబాబును కోరారు.

## అంగన్వాడీల భవిష్యత్తు మెరుగుపడేనా!

- కాంగ్రెస్ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 16: అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని చంద్రబాబు ప్రభుత్వానికి కాంగ్రెస్ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అంగన్వాడీ వ్యవస్థ మహోన్నతమైన వ్యవస్థ అని, ఇది కాంగ్రెస్ పార్టీ మానస పథకం అని పేర్కొన్నారు. అంగన్వాడీలకు ఇస్తున్న గౌరవ వేతనం చా లా స్వల్పమన్నారు. పదవీ విరమణ తర్వాత వీరి భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కా ర్యక్రమాలు చేపట్టినా గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కనీసం చంద్రబాబు ప్రభుత్వమై నా అంగన్వాడీల సమస్యల పట్ల దృష్టి పెట్టి వీలైనంత మేరకు వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

---

# మేమేం పాపం చేశాం..!

- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- తండ్రి చనిపోయిన నెల రోజులకే తల్లి మృతి
- సాయం కోసం ఆర్తనాదాలు



అనాథలుగా మిగిలిన బిడ్డలు

**కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్న వారిపై భగవంతుడు కన్నెర్ర చేశాడు. తండ్రి లేడనే బాధ మరువకముందే తల్లి దూరం కావడంతో మేమేం పాపం చేశామంటూ.. ఆ చిన్నారులు గుండెలు పగిలేలా ఏడ్చారు. ఇది చూసిన ప్రతిఒక్కరి గుండె తల్లడిల్లిపోయింది. తల్లీ, తండ్రి దూరమైన ఆ బిడ్డలను చూసి ప్రతిఒక్కరూ కంటతడిపెట్టారు. ఇటువంటి పరిస్థితి పగవాడికి కూడా రాకూడదంటూ ఆవేదన చెందారు.**

మైదుకూరు రూరల్, జూన్ 16: మైదుకూరు మండలం పాతూరులోని కంసలబావి వద్ద గత మూడు సంవత్సరాలుగా నివాసముంటున్న యాగంటి ఈశ్వర్ కూలి పనులు చేసకొంటూ జీవనం సాగిస్తుండేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో ఈశ్వర్ సంపాదన చాలక భార్య కూడా కూలి పనులకు వెళ్తుండేది. అయితే విధి ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. ఉన్నపలంగా గత మే నెలలో ఈశ్వర్ గుండె పోటుతో అకస్మాత్తుగా మరణించాడు. పేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలను కూడా స్థానికులు చందాలు వేసుకొని జరిపించారు. అప్పటి నుంచి భర్త మృతిచెందాడనే మనోవేదనను దిగమింగుకొని తల్లి రమాదేవి కూలిపనులకు వెళ్తూ బిడ్డలను కంటికి రెప్పలా చూసుకుంటూ ఉండేది. కానీ భర్త మృతిని జీర్ణించుకోలేక, ఆర్థికసాయం చేసేవారు లేక దిగులు చెందుతూ యాగంటి రమాదేవి (36) శుక్రవారం బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. తలలో రక్తనాళాలు పగిలిపోవడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు వారి బంధువులు తెలిపారు. అసలే ఇంటి పెద్దదిక్కు చనిపోయి నెల రోజులు గడవకముందే, ఇంటికి ఆసరాగా ఉన్న తల్లి కూడా చనిపోవడంతో వాసంతి (8వ తరగతి), ప్రవల్లిక (ఆరవ తరగతి), శివకుమార్ (మూడవ తరగతి) అనాథలుగా మిగిలిపోయారు. వీరిని చూసిన ప్రతిఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. రమాదేవి అంత్యక్రియలను కూడా పలువురు చందాలు వేసుకొని జరిపించారు. కాగా ముగ్గురు బిడ్డలను ఆదుకొనేందుకు తమవంతుగా సాయం చేస్తామని పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. పాతూరులోని యాపరాల చిన్న, వాసు, వెంకటేశ్ మరి కొంతమంది యువకులు తమ వంతుగా డబ్బులను పోగుచేస్తున్నారు. ఇప్పటికే రూ.లక్షకు పైగా డబ్బులను చందాల రూపంలో వసూలు చేశారు.





మృతదేహం వద్ద రోదిస్తున్న బిడ్డలు.. ఇన్‌సెట్‌లో మృతురాలు రమాదేవి (ఫైల్‌ఫొటో)

అనాథలుగా మిగిలిపోయిన బిడ్డలను ఆదుకొనేందుకు, ఆర్థిక సాయం చేసేందుకు దాతలు 9966229965, 9848261815 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వీరికి తగు సాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

- కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 16: జిల్లాలోని ముస్లింలకు కలెక్టర్ విజయరామరాజు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలకు బక్రీద్ పర్వదినం అత్యంత ప్రీతికరమైనదని, మత సామరస్యానికి ప్రతీక అయిన జిల్లా ప్రజలకు సకల శుభాలు, ఆయురారోగ్యాలు చేకూరాలని కోరారు. ఈ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో సంతోషాన్ని నింపాలని కలెక్టర్ ఆ ప్రకటనలో ఆకాంక్షించారు.

## 28 రోజులు.. రూ.39.64 కోట్లు

- జోరుగా మద్యం విక్రయాలు

మదనపల్లె టౌన్, జూన్ 16: జిల్లా పరిధిలోని మదనపల్లె ఎక్సైజ్ డిపో పరిధిలో మే నెలలో 28 రోజులకు గాను మద్యంప్రియులు ఏకంగా రూ.39.64 కోట్ల విలువైన మద్యం తాగేశారు. ఎన్నికల సందడి, రాజకీయ నాయకుల ప్రలోభాలు వెరసి మదనపల్లె డిపో పరిధిలో 68ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రూ.36.23 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇవి కాకుండా మదనపల్లె డిపో పరిధిలోని ఆరు బార్లలో రూ. 3.41 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. మొత్తం మీద మే నెలలో రూ.39.64 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగడం గమనార్హం. మే నెలలో 31 రోజులు ఉండగా అందులో ఎన్నికలు నిర్వహించిన 13వ తేదీ, ముందు రోజు, తరువాత రోజు కలిపి మూడు రోజులు మద్యం విక్రయాలపై నిషేధం విధించారు. ఇవి పోను మిగిలిన 28 రోజుల్లో మద్యం ప్రియులు పెద్దమొత్తంలో మద్యం తాగేశారు. ఏప్రిల్‌లో రూ.20.94 కోట్లు, మార్చిలో మాత్రం ఏకంగా రూ.35.42 కోట్ల మద్యం విక్రయాలు జరగడం విశేషం. మొత్తం మీద ఎన్నికల పుణ్యమా అని అప్పటి ప్రభుత్వానికి మూడు నెలల్లోనే రూ.95 కోట్లు మద్యం విక్రయాల ద్వారా ఆదాయం వచ్చింది.

---

# అల్పాహారం తిని వస్తూ.. అనంత లోకాలకు

- స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- మహిళ, ఆమె మరిది కొడుకు మృతి
- కుమారునికి తీవ్ర గాయాలు

**మండల పరిధిలోని పాత టోల్‌గేటు ప్రాంతంలో మరో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పక్కనే నూతనంగా ప్రారంభించిన హోటల్ నుంచి అల్పాహారం తిని వస్తూ స్కూటీ ఎక్కి రోడ్డుపైకి వచ్చిన మహిళ, ఆమె కుమారుడు, ఆమె మరిది కుమారుని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇరువురు మృతి చెందగా.. ఒకరు తీవ్రగాయాలపాలయ్యారు.**

చెన్నూరు, జూన్ 16: బద్వేలు పట్టణానికి చెందిన జిక్కా రెడ్డికాత్యాయని ఆమె కుమారుడు నవీన్‌కుమార్, మరిది కుమారుడు రేవంత్‌తో కలిసి ఆదివారం రాత్రి చెన్నూరు వైపు వచ్చారు. వారు పాత టోల్‌గేటు వద్ద ఉన్న ఓ హోటల్‌లో అల్పాహారం సేవించి తిరిగి రోడ్డుపైకి స్కూటీలో ముగ్గురు రాగా అప్పుడే కర్నూలు నుంచి కడప వైపు వస్తున్న ఏపీ 04 టి డబ్ల్యు 6366 నంబరు గల బస్సు స్కూటీని ఢీకొంది. ఈ సంఘటనలో స్కూటీలో ఉన్న జిక్కా రెడ్డికాత్యాయణి (35), ఆమె మరిది కుమారుడు రేవంత్ (13)లు సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. ఆమె కొడుకు నవీన్‌కుమార్ తీవ్ర గాయాలపాలు కాగా చికిత్స నిమిత్తం 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. కాగా వారు ఎక్కడికి వెళ్లింది తెలియలేదు. కానీ వారి వద్ద ఉన్న లగేజీ బ్యాగులో తడి బట్టలు ఉండడంతో ఆదివారం సరదాగా ఎక్కడికైనా బయటకు వెళ్లి ఉంటారని సంఘటనా స్థలంలో చర్చించుకున్నారు. అయితే గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన ఈ ప్రాంతంలో ఇప్పుడు మహిళ, ఆమె మరిది కుమారుడు దుర్మణం చెందడంతో చూసిన వారు కన్నీంటి పర్యంతమయ్యారు. ప్రమాదం జరిగిన సమయం రాత్రి 7 గంటల ప్రాంతం కావడం, టోల్‌గేటు ప్రాంతం ఎక్కువ విశాలంగా ఉండడం, డివైడర్లు, లైట్లు లేకపోవడం కూడా ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని అక్కడ చూసిన వారు అంతా చెప్పుకున్నారు. కాగా మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఏఎస్ఐ జాకీర్‌హుసేన్, హెడ్ కానిస్టేబులు వెంకటరాయులు, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు.

### ఎన్నిమార్లు చెప్పినా ఇంతే..

పాత టోల్‌గేటు వద్ద చీకటి పడితే ప్రమాదాలకు నిలయంగా ఉంటోంది. పలుమార్లు పత్రికల్లో వార్తలు వచ్చినా, ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. నగర పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో కనీసం రెండు లైట్లు కూడా వేసేందుకు డబ్బులు లేవా, వారు లైట్లు వేసి ఉండింటే రెండు నిండు ప్రాణాలు నిలిచేవి కదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లైట్లు లేనందునే ఇద్దరూ అకారణంగా మృతిచెందారని, అటు హైవే అధికారులపై ఇటు కార్పొరేషన్ అధికారులపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో లైట్లు వేయకపోతే ఇంకెన్ని ప్రాణాలు బలవ్వాల్సి వస్తుందోనని అంటున్నారు.

### పోలీసులను ఢీకున్న ద్విచక్ర వాహనం

చెన్నూరు మండల పరిధిలోని పాత టోల్‌గేటు ప్రాంతంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందగా వారి వివరాలు సేకరిస్తున్న పోలీసులను కడప వైపు ద్విచక్ర వాహనంలో వచ్చిన ఓ యువకుడు బలంగా ఢీకొన్నాడు. ఈ సంఘటనలో హెడ్ కానిస్టేబుల్ వెంకటరాయులు, శ్రీకాంత్‌తో పాటు అక్కడ పోలీసులకు సమాచారం తెలుపుతున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. బలంగా ఢీకొనడంతో వీరు నలుగురు ఎగిరి కిందపడ్డారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు ఆ యువకున్ని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి కేసు నమోదు చేయమని చెప్పడం జరిగింది.





సంఘటనా స్థలంలో మృతి చెందిన జిక్కా రెడ్డికాత్యాయని, రేవంత్

## రాజకీయ సన్యాసం ఎప్పుడు రాచమల్లు ?

- టీడీపీ రాష్ట్ర నాయకుడు సురేశ్‌నాయుడు, ముక్తియార్

ప్రొద్దుటూరు, జూన్ 16: రాజకీయ సన్యాసం ఎప్పుడు చేస్తావో చెప్పు రాచమల్లు.. అంటూ టీడీపీ రాష్ట్ర నాయకుడు సురేశ్‌నాయుడు, ముక్తియార్‌లు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక పీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రొద్దుటూరులో తాను బతికి వున్నంత వరకు టీడీపీ జెండా ఎగరనీయనని, భూస్థాపితం చేస్తానని, ఒకవేళ జెండా ఎగిరితే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాజకీయ సన్యాసం చేస్తానని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారన్నారు. ఇప్పుడు ప్రొద్దుటూరులో టీడీపీ జెండా ఎగిరిందని, రాజకీయ సన్యాసం ఎప్పుడు ప్రకటిస్తావో చెప్పాలన్నారు. జగన్ ఐదేళ్ల అరాచక పాలనకు జనం ఆగ్రహంతో తీర్పునిచ్చారని, 175 సీట్లకు గానూ 164 సీట్లు కూటమికి ఇచ్చి రాష్ట్రంలో కనీవిని ఎరుగని మెజార్టీ కట్టబెట్టారన్నారు. జగన్‌తో పాటు అహంకారం నిండిన రాచమల్లుకు కూడా ప్రొద్దుటూరు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అంతేకాకుండా మీ అమ్మకోరిక మేరకు నీవు బతికి వున్నంత వరకు శాశ్వత అన్నదానం పెడతానని చెప్పి రాజన్న రాచమల్లు క్యాంటీన్ ఎన్నికల ముందు ఏర్పాటు చేశావని, దాన్ని ప్రజలకిచ్చిన మాట మేరకు కొనసాగిస్తావా లేదా ఎత్తేస్తావా ప్రకటించాలన్నారు. లేదంటే అదే స్థలంలో అన్నాక్యాంటీన్ పెడతామన్నారు. మున్సిపాల్టీలో అడ్డంగా అవినీతికి పాల్పడి దోచుకున్నారని, వాటన్నింటిని వెలికితీస్తామని తెలిపారు. ఎన్నికల ముందే జగన్ వద్దు అని ప్రజలు నిర్ణయించుకున్నారని, అందుకే ఈ ఫలితాలొచ్చాయన్నారు. సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ కామిశెట్టి బాబు, ఖలీల్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు సురేశ్‌నాయుడు, ముక్తియార్ తదితరులు

## గండిలో నిత్యాన్నదానానికి లక్ష విరాళం



ఆలయ కమిటీ ఛైర్మన్‌కు లక్ష రూపాయలు విరాళం అందిస్తున్న పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా సరళమ్మ

కమలాపురం రూరల్, జూన్ 16: గండి క్షేత్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కమలాపురం వాసి కంకర సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డి విజయం సాధిస్తే నిత్యాన్నదానానికి లక్ష రూపాయలు విరాళం ఇస్తామని మొక్కుకున్నామన్నారు. గెలుపొందడంతో మొక్కు చెల్లించుకునేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, ఆయన తల్లి పుత్తా సరళమ్మ చేతుల మీదుగా కంకర సుబ్బారెడ్డి దంపతులు అన్నదానానికి రూ.1,00,016లు అందించి మొక్కుబడి తీర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో పుత్తా సాయినరసింహారెడ్డి, గొంగల్‌రెడ్డి దివాకర్‌రెడ్డి దంపతులు మరియు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌ప్లాంట్లకు తాళాలు

ఇబ్బందుల్లో ప్రజలు ● తెరిపించాలని వినతి



కోట వీధి వాటర్‌ప్లాంట్‌కు తాళం - నీళ్లకోసం వచ్చి వెనక్కి వెళుతున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 16: మున్సిపాలిటీ వాటర్‌ప్లాంట్లను సంబంధిత అధికారులు తనిఖీ చేసి సీజ్ చేశారు. కొంత కాలంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఒక క్యాన్ మూడు రూపాయలతో అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అందులో వైసీపీ చోటా నేతల అధీనంలో ఉండేది. ప్రభుత్వం మారిన తర్వాత అధికారులు ఆ వాటర్‌ప్లాంట్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. అయితే మున్సిపాలిటీకి సంబంధించి వాటర్‌ప్లాంట్లు ఉండడం వలన ప్లాంట్లకు వినియోగించిన కరెంటు బిల్లులు లక్షల్లో పెండింగ్ ఉన్నందు వలన వాటర్ ప్లాంట్లకు తాళాలు వేసినట్లు తెలుస్తోంది. అయితే కరెంటు బిల్లులకు సంబంధించిన సమస్య, మున్సిపాలిటీ అధికారులు పరిష్కరించి ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఒకవేళ ఇతరులు ముందుకు వచ్చి వారికి అప్పగిస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు ఉండవని త్వరగా పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రెండు రోజుల నుంచి వాటర్‌ప్లాంట్ల వద్దకు వచ్చిన జనాలు తాళాలు వేయడం వలన వెనుతిరిగి వెళుతున్నారు.

# భగీరథ ప్రయత్నం

వెయ్యి అడుగులు తవ్వినా కనపడని నీటి జాడ ● అందని వైఎస్ఆర్ జలకల?'

అడుగంటిన భూగర్భజలాలు - తీవ్ర ఇబ్బందుల్లో రైతులు ● వెలిగల్లు నుంచి సాగునీరు అందించాలని వినతి

గాలివీడు, జూన్ 16: దివి నుంచి భువికి భగీరథుడు గంగను తీసుకొచ్చినట్లు మండల రైతులు నీటి కోసం భగీరథుడిలా అనేక యత్నాలు చేశారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వెయ్యి అడుగులకు పైగా తవ్వినా నీటి జాడలేదని వాపోతున్నారు. మన జిల్లా వాసి ముఖ్యమంత్రి అయితే మన మండలం కొద్దిమేరకైనా అభివృద్ధి చెందుతుందని ఆశపడిన ప్రజలకు తాగు, సాగునీరు అందించడంలో నిరాశే ఎదురైంది. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకల పథకం రైతులకు కలగా మిగిలింది. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్లున్నా చెరువులు, భూములకు నీళ్ల అందంచలేదని దుస్థితిలో ప్రభుత్వం నిలిచిపోయింది. దేశానికి రైతే వెన్నెముక, రైతు లేనిదే రాజ్యము లేదు, రైతుతోనే దేశం సుభిక్షం అనేవి నినాదాలుగా మారాయే తప్ప రైతుకు కావాల్సిన నీరు దొరకడం లేదు. వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే నీరు అవసరం. భూములకు నీటిని అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. చేసేది లేక వ్యవసాయంపై మక్కువ సంపుకోలేక రైతులు లక్షలు వెచ్చించి బోరుబావులు వేసినా నీటి చుక్క కనపడలేదు. దీంతో అప్పు చేసి బోరుబావులు వేసిన రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు. వివరాల్లోకెళితే...

మండలంలో 25 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అన్ని గ్రామ పంచాయతీల్లో 150కిపైగా కుంటలు, చెరువులున్నాయి. వీటితో పాటు వెలిగల్లు, కుషావతి ప్రాజెక్టులున్నాయి. వీటి కింద 10 వేల ఎకరాలు సాగు భూమి కలదు. ఎలాంటి నీటి ఆధారం లేకుండా 15 వేల ఎకరాల మెట్టభూమి కలదు. కుంటల కింద ముఖ్యంగా వరి, జొన్న, పొద్దుతిరుగుడు, కూరగాయల పంటలను సాగు చేస్తారు. నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో వేరుశనగ, కంది, ఉలవ, పొద్దుతిరుగుడు, అరటి, జామ, సపోటా, మామిడి, నిమ్మ వంటి పండ్ల తోటలను సాగు చేస్తున్నారు.

### వెయ్యి అడుగులు తవ్వినా....

ఈ ఏడాది నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మండలంలో కరువు ఛాయలు నెలకొన్నాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షపాతం చాలా తక్కువ శాతం నమోదవడంతో రైతులు పంటలను సాగు చేయలేకపోయారు. నూలివీడు, సీసీపల్లె, గుండ్లచెరువు, పేరంపల్లె, గోపనపల్లె, ఎగువగొట్టివీడు, పూలుకుంట, గోరాన్‌చెరువు, అరవీడు పంచాయతీల్లోని సాగు భూములకు వెలిగల్లు నుంచి నీటి పారుదల సౌకర్యం లేదు. దీంతో రైతులు పంటల సాగు కోసం, మామిడి తోటలను కాపాడుకోవడం కోసం వెయ్యి అడుగుల వరకు బోరు వేసినా నీళ్లు పడని పరిస్థితి నెలకొంది. వెయ్యి అడుగులు బోరు వేయాలంటే కేవలం బోరుకు మాత్రమే రెండు లక్షలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. ఇటీవల మండల వ్యాప్తంగా మామిడి తోటల పెంపకం ఎక్కువైంది. ప్రతి గ్రామంలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కురవక పోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో రైతులకు ఉన్న బోరుబావులు అన్నీ నీళ్ల లేక ఎండిపోయాయి. బోరుబావులు అడుగంటిపోవడంతో మామిడి తోటలను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు రైతులు పదకొండు వందల అడుగులపైన బోరు వేసినా నీళ్లు పడలేదని చేసేది ఏమీ లేక ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీళ్ల తోలుకున్నామని వాపోతున్నారు. ట్యాంకర్ రూ.650 పెట్టి మామిడి చెట్లు, నీళ్ల తోలుకున్నాయని, అలా నెలకు మూడు సార్లు తోలామన్నారు. చెట్లను కాపాడుకోవడం కోసం బోరుబావుల కోసం నీటి ట్యాంకర్ల కోసం లక్షలు ఖర్చు చేశామని రైతులు వివరించారు. ఆర్భాటంగా ప్రారంభించిన వైఎస్ఆర్ జలకల పథకం రైతులకు కలగా మారిపోయింది.



వెయ్యి అడుగులు వేసినా నీటి చుక్క పడని వ్యవసాయ బోర్లు

### వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుకు శాపం

2019లో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో తాగు, సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైంది. వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్లున్నా చెరువులు, భూములకు అందంచలేని దుస్థితిలో ప్రభుత్వం నిలిచిపోయింది. తాగు, సాగునీరు అందించాలని ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా వారు ఏ కోశాన పట్టించుకోలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని గ్రామాల్లో కనీసం చెరువులకు నీటిని సరఫరా చేసి ఉంటే ఈ రోజు ఇలాంటి దుర్భర పరిస్థితులు ఎదురయ్యేది కాదన్నారు. నీళ్లు ఉన్నా ఈ రోజు సాగు భూములకు నీళ్లు అందించలేక పోవడంతో తాము లక్షల్లో నష్టపోయామని, దీనికంతటికీ కారణం వైసీపీ ప్రభుత్వం అవలంబించిన రైతు వ్యతిరేక విధానాలేనని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడే ప్రభుత్వమైనా వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందించి మమ్మల్ని కాపాడాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వెయ్యి అడుగులు వేసినా....



12 ఎకరాల భూమిలో 600 మామిడి చెట్లు నాటాము. వీటికి నీళ్లను సరఫరా చేయడానికి ఆరు బోర్లు వేశారు. ఒక్కో బోరు వెయ్యి అడుగులకుపైనే ఉన్నవి. కానీ నీళ్లు పడలేదు. ఈ ఏడాది మార్చిలో కూడా వెయ్యి అడుగుల బోరు వేశాను. రెండు లక్షలు ఖర్చు అయ్యింది. అయినా చుక్క నీరు కూడా పడలేదు. చెట్లను కాపాడుకోవడం కోసం ట్యాంకర్ల ద్వారా మామిడి చెట్లకు నీటిని తోలుకుంటున్నారు. 600 చెట్లకు ఒక్కోసారి వంద ట్యాంకర్ల నీటిని తోలారు. నెలకు మూడు సార్లు చొప్పున మూడు నెలలు ట్యాంకర్ల ద్వారా నీటిని తోలుకున్నాము. ఒక్క తడికి రూ.65 వేలు నెలకు మూడు తడులుకు గానూ రూ.1.95 వేలు మూడు నెలలకు ఐదు లక్షల 85 వేల రూపాయలు ఖర్చు చేశాను. టీడీపీ ప్రభుత్వం మామిడి తోటలను కాపాడుకోవడానికి నీటి సరఫరాకు ఎకరాకు ఇంత చొప్పున డబ్బులను అందజేసింది. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రూపాయి కూడా అందచేయలేదు.

*నక్కల యోగాంజుల్ రెడ్డి, నక్కలవాండ్లపల్లె, నూలివీడు*

### ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించాలి



వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా చెరువులు, బావులకు, సాగునీరందించాలి. ఈ ఏడాది మండలంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మామిడి తోటలను కాపాడుకోవడం తలకు మించిన భారమైంది. పంటల సాగు కోసం 5 వ్యవసాయ బోర్లు వేశాను. కానీ బోర్లు అన్నీ ఎండిపోయాయి. బోర్లు వేయడం వల్ల లక్షల్లో నష్టపోవాల్సి వచ్చింది.

*వెంకట్రమణ, గుర్రంవాండ్లపల్లె, సీసీపల్లె*

## రోడ్డు ప్రమాదంలో బండి రామచంద్రయ్య మృతి



రామ చంద్రయ్య (ఫైల్‌ఫోటో)

మైదుకూరు, జూన్ 16: స్థానిక నంది, భారతి, కొండస్వామి విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి రామ చంద్రయ్య (58) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పట్టణ సమీప బైపాస్‌లో ద్విచక్ర వాహనంలో మైదుకూరు వైపు వస్తుండగా అతివేగంగా వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. తలకు బలమైన గాయాలు తగలడంతో 108లో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పట్టణంలో మూడు విద్యాసంస్థలు నిర్వహిస్తుండంతో అందరికీ సుపరిచితుడు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కారు, లారీ ఢీ - ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

పుల్లంపేట, జూన్ 16: పుల్లంపేట బైపాస్ రోడ్డులో ఎస్‌వీ కల్యాణ మండపం వద్ద ఆదివారం కారును లారీ కొనడంతో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. పోలీసుల కథనం మేరకు మేరకు మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా రత్నమాల నివాసులు నలుగురు తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరారు. ఆదివారం ఉదయం 6 గంటలకు పుల్లంపేట వద్ద లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా వెనుకవైపు లారీ కారును బలంగా ఢీకొంది. అదే సమయంలో ఎదురుగా చెన్నై నుంచి వెళుతున్న సిమెంట్ ట్యాంకర్ కూడా కారును ఢీకొనడంతో కారు పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ విశ్వనాథ్ చంద్రకాంత్, సంతోష్ రఘు, నందిని స్వల్పంగా గాయపడ్డారు. కారులో ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రయాణీకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. రఘురాం తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన బాలకృష్ణ

సంబేపల్లె, జూన్16: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిపై మోటకట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... రాయచోటి పట్టణం ఎస్ఎన్‌కాలనీ వాసి బాలకృష్ణ తన ద్విచక్రవాహనంలో సంబేపల్లి వైపు నుంచి రాయచోటికి వస్తుండగా అదుపు తప్పి ద్విచక్రవాహనం బోల్తాపడింది. సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు 108లో రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

● జిల్లాస్థాయి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే చైతన్యరెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, జూన్ 16: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పేరుపేరునా పరిచయం చేసుకుంటూ అభినందనలు తెలిపారు. ముందుగా టీడీపీ అభిమానులు, చైతన్యరెడ్డి పుట్టినరోజు వేడుకలను ముందస్తుగా ఆయనతో భారీ కేక్ కట్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి జీవితాల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఖాదర్‌బాషా, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి, ఎల్లారెడ్డి, రామసుబ్బారెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, బీసీ నేత గోపాల్‌యాదవ్, శంకర్‌యాదవ్, దాదిరామయ్య, నబీరసూల్, వివిధ ప్రాంతాల టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

# ఏ ప్రభుత్వమైనా మాదే దందా

ఇసుక అక్రమ రవాణా నిలువరించలేరా? ● అధికారుల నిర్లక్ష్యానికి మతలబేంటి

పెన్నానది నుంచి యథేచ్ఛగా సాగుతున్న దందా ● స్పందించని జిల్లా అధికారులు



ఆర్డీఓ కార్యాలయం మీదుగా రాత్రి తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్ - గాంధీ విగ్రహం వద్ద తరలిపోతున్న ఇసుక ట్రాక్టర్

జమ్మలమడుగు, జూన్ 16: ఏ ప్రభుత్వమైనా మేము చెప్పిందే వేదమని, మేము చేసేదే దందా అనేలా ఇసుక మాఫియా వ్యవహరిస్తోంది. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా యథేచ్ఛగా దందా సాగుతోంది. జమ్మలమడుగు పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా ఆపేదెవరో చూద్దామని ఇసుక అక్రమ రవాణా చేసే యజమానులు, డ్రైవర్లు సవాల్ విసురుతున్నారు. మండలంలోని పెన్నానది పరిసర ప్రాంతాల్లో 4 నుంచి 5 చోట్ల ఎక్స్‌కవేటర్ల ద్వారా ట్రాక్టర్లకు ఇసుక నింపి ప్రధాన రోడ్లపైనే అధికారుల కార్యాలయాల ఎదురుగానే తరలిస్తున్నారు. వివరాల్లోకెళితే....

ముద్దనూరు రోడ్డులోని పెన్నానది సమీపం నుంచి సాయంత్రం ఏడు గంటలకు తోడేళ్లలాగా పెన్నానదిలో చేరి అక్రమ ఇసుక రవాణా అధిక స్పీడుతో పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం, పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద నుంచి మార్కెట్ రోడ్డుమీదుగా నారాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం తేరు రోడ్డు మీదుగా బయటి ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారు. గూడెం చెరువు, పొన్నతోట, అంబవరం, గొరిగెనూరు, పి.సుగుమంచిపల్లె, దానవులపాడు, పెన్నానది పరిసర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా దందా సాగుతోంది. మండలంలోని మోరగుడి గ్రామం, మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం పెన్నానది నుంచి ఇసుక రాత్రి సమయాల్లో వందల ట్రాక్టర్లు ఇసుక తరలిపోతోంది. ఇదంతా జమ్మలమడుగు, మైలవరం, ప్రాంతాల్లోని సంబంధిత అధికారులు, ఇతర అధికారులు కంటపడుతున్నా ఎవరు పట్టించుకోకపోవడానికి మతలబేంటో తెలియక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఎదురుగానే ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నా ఎందుకు స్పందించలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు ఇసుక మాఫియాకు సంబంధించిన యజమానులను ఇసుక ట్రాక్టర్లు అధిక స్పీడుతో వెళుతున్నాయని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎలాగని అడిగినా దిక్కున్నచోట చెప్పుకోమని తాము ఇదే స్పీడుతోనే వెళతామని కొందరు చెప్పినట్లుగా జమ్మలమడుగు పాత బస్టాండు, కూరగాయల మార్కెట్‌వీధిలో చెప్పినట్లు ప్రజలు వాపోతున్నారు. రాత్రిళ్లు పోలీసు సిబ్బంది గస్తీ తిరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. మార్చి నెల నుంచి ఇప్పటి వరకు ఇసుక ట్రాక్టర్లపై అప్పట్లో తిరిగిన టిప్పర్లపై ఎవరూ చర్యలు తీసుకోకపోవడంతో మాఫియా జోరు పెంచిందని చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా జమ్మలమడుగులోని పోలీసు అధికారులు జిల్లాలోని సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇసుక మాఫియా కొందరు అధికారులతో మాట్లాడుకుని తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించాలని పెన్నానదీ పరిసర ప్రాంత ప్రజలు, పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## స్కూటరిస్టుకు గాయాలు

కొండాపురం, జూన్ 16: తిమ్మాపురం సమీపంలో స్కూటరిస్టుకు గాయలయ్యాయి. ఆదివారం కృష్ణారెడ్డి కొండాపురం నుంచి లావనూరుకు స్కూటర్‌లో వెళుతుండగా స్కూటర్ పంచర్ అయింది. దీంతో కృష్ణారెడ్డికి పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఇతన్ని 108లో తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ఇతను బేల్దారి పని చేస్తున్నట్లు తెలిసింది.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని...

పుల్లపేంట, జూన్ 16: పుత్తనవారిపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం మోటారు బైకును ఢీకొనడంతో కొట్టం శివ తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం సాయంత్రం గాదెలకు చెందిన శివ బైకుపై రాజంపేటకు బయలుదేరాడు. పుత్తనవారిపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో శివ కాలు పూర్తిగా తెగిపోయింది. దీంతో పుల్లంపేట పోలీసులు శివను 108లో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

## కలసపాడులో చోరీ

కలసపాడు, జూన్ 16: మండల కేంద్రమైన కలసపాడులో చోరీ జరిగినట్లు ఎస్ఐ నాగముని తెలిపారు. వెంకట్రామిరెడ్డి మూడురోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. శనివారం సాయంత్రం తిరిగి రాగా గుర్తు తెలియని వ్యక్తులు బీరువా పగలగొట్టబడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి ఎనిమిది తులాల బంగారు నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టిప్పర్‌కు నిప్పు

పెండ్లిమర్రి, జూన్ 16: పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌కు నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఉద్దేశపూర్వకంగా టిప్పర్‌కు నిప్పు అంటించారని టిప్పర్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చాపాడు ఎస్ఐ కొండారెడ్డి వీఆర్‌కు

కడప (క్రైం), జూన్ 16: చాపాడు ఎస్ఐ ఎస్‌వీ కొండారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నేపధ్యంలో అధికార పార్టీకి సహకరించడం, టీడీపీ నేతపై దాడి ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించాలని ఆరోపణలు రావడంతో ఆయనను వీఆర్‌కు బదిలీ చేశారు.

## జూలై 1 నుంచి ఎల్ఎల్‌బీ రెగ్యులర్ సప్లిమెంటరీ పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16: వైవీయూ పరిధిలోని ఎల్ఎల్‌బీ (ఐదేళ్ల, మూడేళ్ల) విద్యార్థులకు సెమిస్టరు పరీక్షలు జూలై 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ 1వ సెమిస్టరు పరీక్షలు 1, 3, 5, 8, 10 తేదీల్లో జరుగుతాయన్నారు. 3, 5ఏళ్ల ఎల్ఎల్‌బీ సప్లిమెంటరీ పరీక్షలు ఇదే తేదీల్లో ఉంటాయన్నారు. వైవీయూ కేంద్రంగా జరిగే ఈపరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## గంగమ్మ ఆలయంలో నగలు చోరీ

కొండాపురం, జూన్ 16: గండ్లూరు గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో నగలు చోరికి గురయ్యాయి. గుడిలో గంగమ్మ తల్లికి అలంకరించిన వెండి కిరీటం, వడ్డాణం శుక్ర వారం మధ్యాహ్నం అపహరించుకుని వెళ్లినట్లు స్థానికులు తెలి పారు. కాగా వీటి విలు వ సుమారు రూ.50,000 వరకు ఉం టుందని గుడి నిర్వాహ కులు తెలిపారు. గుడిలో ఎవరూ లేనిది గమనించి వీటిని దొంగిలించినట్లు తెలుస్తోంది. గుడిలో ఎవరూ లేనప్పుడు తాళలు వేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గుడిలో సీసీ కెమెరాలు బిగించుకోవాలని కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

## గంగమ్మ తల్లికి పూజలు



పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

సీకేదిన్నె, జూన్ 16:చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట సమీపంలో వెలసిన గంగమ్మ దేవత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేష్ఠ మాసం శుద్ధదశమి సందర్భంగా దశపాపహర దశమిని పురస్కరించుకుని గంగమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తే విశేష ఫలితం దక్కుతుందని భక్తులు విశ్వాసం. దీంతో దశపాపహర దశమి సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దశపాపహర దశమి సందర్భంగా అనేక ఫలితాలు కలుగుతాయని పురాణాల్లో చెప్పడంతో మానవులు చేసిన పది పాపాలను ఈ ఒక్కరోజే తొలగించుకోవచ్చని భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారి మొక్కులు తీర్చుకున్నారు. దశపాపహర దశమి రోజు గంగాస్నానం ఆచరిస్తే సర్వపాపాలు తొలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయంలో ఈవో ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు నిర్వహించారు.

## తండ్రి పాత్ర అమోఘం



వెంకటరెడ్డితో ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 : సమాజంలో తండ్రి పాత్ర అమోఘమని అనిర్వచనీయమని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కెచిన్నపరెడ్డి తెలిపారు. ఫాదర్స్‌డే పురస్కరించుకుని ఆదివారం ఇంటాక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వందేళ్లు పూర్తి చేసుకున్న చప్పిడివెంకటరెడ్డి అనుభవాలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబంలో కుమారుడు తన కంటే పెద్దస్థాయిలో ఉండాలని కోరుకునే వ్యక్తి నాన్న అన్నారు. పిల్లలకు ఏ కష్టం రానీయకుండా వారికి కష్టాలు తెలియకుండా పెంచి పెద్ద చేసే గొప్ప మనసు తండ్రిది అన్నారు. అలాంటి తండ్రుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఆది రవి కుమార్, రిటైర్డ్ డీఎస్పీ రాజశేఖరరెడ్డి, ఇంటాక్ సభ్యులు బోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.





## పెండింగు డీఏలు విడుదల చేయాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 :ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని, వాటిలో ప్రధానంగా 12వ పీఆర్సీ అమలు చేయాలని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం కడప ఎమ్మెల్యే కార్యాలయంలో వారు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగు బకాయిలు విడుదల చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజి నాయకులు గంగాధర్, జయరాముడు, సురేంద్ర, వెంకటరమణ, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నేడు నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, జూన్ 16: బక్రీద్ పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని శిల్పారామం, ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లలో నృత్య ప్రదర్శనలు ఏర్పాటుచేసినట్లు పరిపాలన అధికారి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిల్పారామంలో మదనపల్లెకు చెందిన శ్రీసూర్య డ్యాన్స్ అకాడమీ బృందం కడపకు చెందిన కిషోర్ డ్యాన్స్ అకాడమీ బృందాలచే శాస్త్రీయ, జానపద, సినిమా పాటల నృత్య ప్రదర్శనలు చేశారన్నారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల ఆటాపాట

కడప (కల్చరల్), జూన్ 16 : కడప నగర సమీపంలోని రిమ్స్ ఆస్పత్రి వద్ద గల శిల్పారామంలో చిన్నారుల ఆటాపాట అలరించిది. ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడపకు చెందిన చిన్నారులు వివిధ సినిమా, జానపద గీతాలకు నృత్యం చేశారు. ఈ నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



## విద్యుత్ సంస్థలో రాజకీయ జోక్యాన్ని నివారించాలి: సీఐటీయూ

కడప (నాగరాజుపేట), జూన్ 16 :విద్యుత్ సంస్థల్లో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని, అలాగే రాజకీయ జోక్యాన్ని నివారించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడప జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు బి.నాగసుబ్బయ్య అధ్యక్షతన నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శనరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. యూనియన్ హక్కులు కోల్పోయారన్నారు. పూర్తిగా రాజకీయ జోక్యంతో బదిలీలు ఇతర కార్యక్రమాలు జరిగాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ సంస్థల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టీడీపీ సానుభూతిపరులని కొంత మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించారని, ఇప్పుడు కూడా ప్రస్తుతం అదే పద్ధతి కొనసాగించేందుకు ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్‌రసూల్, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర బాబు, జిల్లా కార్యదర్శి వెంకటరమణ, పుల్లయ్య, రాజంపేట డివిజన్ నాయకులు ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు,మైదుకూరు,



మాట్లాడుతున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

## మెగా డీఎస్సీకి ముందు చర్చలు నిర్వహించాలి

● ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 :ఎన్నికల హామీల్లో భాగంగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ టెట్ కూడా నిర్వహించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంతో టెట్‌కు చాలా మంది హాజరు కాలేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అధిక పోస్టులతో డీఎస్సీ ప్రకటించడంతో మరోసారి టెట్ నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ విద్యారంగానికి వినాశనంగా మారిన జీవో 117 రద్దు చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఎస్టీఎఫ్‌రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా నాయకులు ఆవుల శ్రీనివాసులు, ఎ.రామచంద్ర, ప్రసాద్, కె.బాలక్రిష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

## ఫీజుల దోపిడీని నియంత్రించండి

కడప (మారుతీనగర్) జూన్ 16:నగరంలో కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని భారతీయ జనతా పార్టీనా యకుల యాపమాని హరినారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. పుస్తకాలు, ఫీజులు, బస్ చార్జీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బు గుంజడం పరిపాటిగా మారిందన్నారు.

ఇప్పటికైనా అధికారులు, ముఖ్యంగా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఫీజుల నియంత్రణపై దృష్టి సారించాలని కోరారు.

## బక్రీదు పండుగ ప్రశాంతత కోసం పోలీసుల కవాతు

చెన్నూరు, జూన్ 16 : మండలంలో సోమవారం జరిగే బక్రీదు పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి గొడవలకు పాల్పడకూడదంటూ ఎఎస్ఐ జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో స్పెషల్ కేంద్ర బలగాలతో చెన్నూరు పురవీధుల్లో కవాతు నిర్వహించారు. చెన్నూరు పట్టణంలో వీధివీధిలో తిరిగి ప్రజలు పండుగను ప్రశాంతంగా జరుపుకోవడం ఆనవాయిగా పెట్టుకోవాలని ఎలాంటి చట్ట వ్యతిరేక పనులకు దిగవద్దని హెచ్చరించారు. అలా కాకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

## జీఓ 117ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 :జీఓ 117ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం హోచిమన్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 16374 డీఎస్సీ పోస్టుల్లో పీఈటీ పోస్టులకు సంబంధించి 132 మాత్రమే కేటాయించిందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పునారలోచించి మరిన్ని పోస్టులు విడుదల చేయాలన్నారు. అలాగే మూతబడ్డ ప్రాథ మిక పాఠశాలలను తెరిపించాలన్నారు. జీఓ 117లో భాగంగా కుదించబడిన ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా ఉన్న వాటిని కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, తేజ, రాజేశ్, నిఖిల్, మస్తాన్, సల్మాన్, శివాజీ పాల్గొన్నారు.

## యువతకు భరోసా కల్పించాలని వినతిపత్రం



క్రిష్ణచైతన్యకు వినతిపత్రం అందిస్తున్న చెన్నూరు యువత

చెన్నూరు, జూన్ 16:ఎమ్మెల్యేగా గెలిచిన పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డికి చెన్నూరుకు చెందిన పలువురు యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ వినతిపత్రం అందించారు. కమలాపురంలో ఆదివారం ఆయనను కలిసి మాట్లాడుతూ నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఇతర దేశాలకు హైదరాబాదు, చెన్నై బెంగుళూరు వంటి నగరాలకు వలస పోతున్నారని, దీంతో అక్కడ కూడా సరైన అవకాశాలు లేకపోవడం, చేసిన అప్పులు పెరిగిపోడం తద్వారా యువత కష్టాలపాలవుతున్నార న్నారు. అందుకే ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తమకు ఉపాధి భరోసా ఇవ్వాలని కోరడం జరిగింది. యువత మస్తానయ్య, సుబ్రమణ్యం, ఇందు, డాక్టర్ పిచ్చయ్యతో పాటు పలువురు యువత పాల్గొన్నారు.

## ఉపాధి హామీ నిధులు విడుదల చేయాలి

● ముఖ్యమంత్రిని కోరిన పీరయ్య

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16:ఉపాధి హామీ పెండింగు నిధులు విడుదల చేయాలని ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు పీరయ్య సుభాషిని కోరారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ 1800 కోట్లు న్యాయస్థానం ద్వారా ఇప్పించడం జరిగిందన్నారు. ఇంకా దాదాపు 700 కోట్లు పెండింగులో ఉన్నాయని వీటిలో కార్యకర్తలకు వడ్డీ కలిపి ఇస్తామని గతంలో చెప్పడం జరిగిందన్నారు. త్వరలో పెండింగు నిధులు విడుదల చేయాలన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరిస్తున్న పీరయ్య, సుభాషిణి

### నేడు ఆకాశవాణిలో ప్రత్యేక కార్యక్రమం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 : సోమవారం కడప కేంద్రం 62వ వసంతంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో రేడియోలో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు కడప కేంద్రం ప్రోగ్రాం హెడ్ మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు సోమవారం ఉదయం 9గంటలకు అనుభవాలు, అపూర్వ కార్యక్రమాల పేరుతో ఎస్.రవికుమార్‌రెడ్డి రచించిన కార్యక్రమం ప్రసారం కానుందన్నా రు. ఇందులో వివిధ రంగాల ప్రముఖులతో పరిచయా లు, శ్రోతల మదిని దోచిన పలు అంశాలు ఉంటాయన్నా రు. మీడియం వేవ్, ఎఫ్ఎం ద్వారానే కాకుండా శ్రోతలు న్యూస్ ఆన్ ఎయిర్‌యాప్ ద్వారా కూడా ఈ కార్యక్రమాలను వినవచ్చన్నారు.

## విద్యార్థుల ఎదుగుదలకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థులు

కడప (మారుతీనగర్) జూన్ 16: విద్యార్థుల ఎదుగుదలకు ప్రతిభా పురస్కారాలు ఎంతగానో దోహదపడతాయని పద్మశాలీయ సేవాసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అవ్వారు వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు అవ్వారు సుబ్బరాయుడు, కార్యదర్శి జానపాటి బాలయానాదయ్య, విద్యాకమిటీ కన్వీనర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. పద్మశాలీయ విద్యార్థినీ, విద్యార్థులు మరింత ఉన్నత స్థితికి ఎదగాలనే సంకల్పంతో గత 15 సంవత్సరాలుగా పదవ తరగతి, ఇంటర్‌మీడియట్ విభాగాలలో ప్రతిభ కనబరచిన వారికి ప్రతిభా పురష్కారాలను ప్రదానం చేసినట్లు తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి పదవ తరగతి, ఇంటర్మీడియట్‌తో పాటు నీట్ పరీక్షలలో ప్రతిభ చాటిన జిల్లాలోని 28 మంది విద్యార్థినీ విద్యార్థులకు పద్మశాలీయ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పద్మశాలీయ భవన్‌లో ఫాదర్స్‌డే సందర్భంగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం విద్యాకమిటీ కన్వీనర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, సభ్యులు వెంకటసుబ్బయ్య, అవ్వారు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయుడు బి.చిన్నసుబ్బరాయుడు ట్రెజరర్ బి.వి. సుబ్బరాయుడితో పాటు జిల్లా నలుమూలల నుంచి పలువరు విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 'ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గిరిజనులకు లబ్ధి చేకూర్చాలి'

కడప (మారుతీనగర్), జూన్ 16: వైసీపీ పాలనలో నిర్వీర్యమైన ఎస్టీ కార్పొరేషన్‌కు తిరిగి పూర్వవైభవం కల్పించి తద్వారా జిల్లాలోని గిరిజనులకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎస్.శివశంకర్ కోరారు. ఆ మేరకు గిరిజన ఐక్యవేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నగర బిల్టప్ సమీప పుత్తా ఎస్టేట్‌లో తెలుగుదేశం పార్టీ కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిని కలిసి విన్నవించారు. గత ఐదేళ్లుగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్రం నుంచి అందే ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సైతం దారిమళ్లించి గిరిజనుల నోట్లో మట్టికొట్టారన్నారు. కావున ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనైనా గిరిజనులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. పుత్తాను కలిసిన వారిలో గిరిజన ఐక్యవేదిక నాయకులు ఎరుకల ప్రసాద్, కె. అశోక్ పాల్గొన్నారు.

## కాలభైరవ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



కాలభైరవ స్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 : కడప నగరానికి చెందిన కాలభైరవ పురం (ఎంఎస్ కొట్టాల)లో ఇష్టకామ్యర్థ కాలభైరవ స్వామి దేవస్థానంలో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లె పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే దంపతులకు కూష్మాండ దీప సేవారాధన, కార్యక్రమంలో పాల్గొని సంతృప్తిచెందారు. బాసట ప్రతినిధులు బాలాజీ పాల్గొన్నారు.

## పాఠశాల నిర్వహణకు అన్ని అనుమతులు తీసుకోవాలి

● ఎంఈఓ జాఫర్ సాదిక్



మాట్లాడుతున్న ఎంఈఓ

వేంపల్లె, జూన్ 16: వేంపల్లెలోని సతీష్‌రెడ్డి సంసిద్ పాఠశాలలో అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే త రగతులు నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి జాఫర్‌సాదిక్ తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఆ పాఠశాలకు ఇంకా కొన్ని అనుమతులు లేవన్నారు. యుడైస్ నెంబర్ కోసం కొన్ని డాక్యుమెంట్లు ఇవ్వాల్సి ఉం దని తెలిపారు. పాఠశాల ప్రారంభంకు మా త్రమే అనుమతి ఉందని, తరగతుల నిర్వహణకు అనుమతి లేదన్నారు. ఈ నెలాఖరులోగా అవసరమైన డాక్యుమెంట్లు ఇవ్వాలని ఎం ఈఓ కోరారు. ఈ విషయాలను గుర్తించి తగు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**అన్ని అనుమతులకు దరఖాస్తు చేశాం**

సతీష్‌రెడ్డి సంసిద్ స్కూల్ కోసం అవసరమైన అనుమతులకు దరఖాస్తు చేశామని ఆ పాఠశాల ఛైర్మన్ సింగారెడ్డి సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 90శాతం అనుమతులు వచ్చాయని, మిగిలిన అనుమతుల కోసం ఇంకా గడువు ఉందన్నారు. గడువులోపు అన్ని అనుమతులు తీసుకొని పాఠశాలను నిర్వహిస్తామని తెలిపారు. అనుమతుల కోసం పనిచేస్తున్న రామగంగిరెడ్డి అనారోగ్యం కారణంగానే కొంత ఆలస్యమైందని తెలిపారు. పాఠశాల నిర్వహణపై తల్లిదండ్రులు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తామని ఆయన తెలిపారు.

## 'సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'



మాట్లాడుతున్న రామాంజనేయులు

వేంపల్లె, జూన్ 16: భవననిర్మాణ కార్మికులకు ఉపయోగకరంగా ఉండిన సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు తెలిపారు. ఆదివారం పులివెందుల రోడ్డులోని గని కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచపు లింగన్న, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా బాలాజీలు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, దస్తగిరి, శ్రీనివాసులు, చలపతి, బుజ్జిబాబు, సిద్దయ్య,చిన్నటోపి, కృష్ణయ్య, అంజి తదితర 50 మంది కార్మికులు హాజరయ్యారు.

## జాతీయ స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయండి



సమావేశానికి హాజరైన మానవ హక్కుల సంఘం ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 : కర్నూలులో ఈ నెల 7న ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం జాతీయ స్థాయి సమావేశం జరగనుందని, జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ ఛైర్మన్ కాసల కోనయ్య తెలిపారు. ఆదివారం కడప వినాయకనగర్ వద్ద గల ప్రైవేటు ఏ భవనంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతంర ఆ యన మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి తమ సంఘః ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. కర్నూలులో జరిగే సమావేశంలో సంఘం విధివిధానాలు హక్కుల పరిరక్షణ కోసం నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి జిల్లా నుంచి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రీజనల్ మీడియా ఛైర్మన్ రాఘవ, నాయకులు సురేష్, రామక్రిష్ణ, జహీర్‌బాషా, సుబ్బలక్ష్మి, సుబ్బారెడ్డి, గౌస్‌మొహిద్దీన్, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

## దోమల నివారణకు మలాథియాన్ పిచికారీ



మలాథియాన్ పిచికారీ చేయిస్తున్న సిద్దయ్య

పులివెందుల రూరల్, జూన్ 16: పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలలో ఆదివారం దోమల నివారణ కోసం మలాథియాన్ పిచికారీ చేసినట్లు పులివెందుల మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. ఈ మలాథియాన్ ఆరు నుంచి ఎనిమిది వారాల వరకు పనిచేస్తుందన్నారు. వసతి గృహాలు పునఃప్రారంభం కావడంతో ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్, వసతి గృహ సంక్షేమ అధికారులు ప్రసాద్, రవీంద్ర పాల్గొన్నారు.

## టీడీపీ కార్యాలయం ప్రారంభం



ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాధవి, శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 16 :కడప నగరం ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్‌లో అందూరి రాంప్రసాద్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాధవీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసలరెడ్డి రిబ్బను కట్ చేసి కార్యాలయం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1 నుండి 13డివిజన్లకు సంబంధించిన ప్రజలు ఈ కార్యాలయ సమస్యలను తెలపవచ్చన్నారు. సమస్యలు పరిష్కారంకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

## స్టాల్స్ టెండర్లకు ఆహ్వానం

పోరుమామిళ్ల, జూన్ 16 : ఏపీఎస్ఆర్టీసీ బద్వేలు డిపో పరిధిలోని బద్వేలు బస్‌స్టేషన్‌లో 21, పోరుమామిళ్ల, కలసపాడు బస్‌స్టేషన్లలో ఖాళీ గా ఉన్న స్టాల్స్‌కు ఈ నెల 28న టెండర్లకు ఆహ్వానించడం జరిగిందని డిపో మేనేజరు తెలిపారు. వీటికి టెండరు ఫాంలు ఈ నెల 14 నుంచి 27 వరకు టెండరు ఫారాలు తీసుకుంటారన్నారు. ఔత్సాహికులు ఎవరైనా ఈ టెండర్లలో పాల్గొనవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 9949225779ను సంప్రదించాలన్నారు.

## ఏపీఎండీసీ డైరెక్టరు రాజీనామా

అట్లూరు, జూన్ 16 : మండలంలోని వేములూరు గ్రామానికి చెందిన ముడమాల బాలమునిరెడ్డి ఏపీఎండీసీ డైరెక్టరు పదవికి రాజీనామ పత్రాన్ని ఏపీ ఎండీసీ మేనేజింగ్ డైరెక్టరుకు సమర్పించినట్లు ఆయన తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి కారణంగా ప్రాధమిక బాధ్యత వహిస్తూ రాజీనామా సమర్పించామని ఆయన ఒక ప్రకటనలోతెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 16: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖలీల్ పేర్కొన్నారు. ఎంపీజే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాజాగృతి కరపత్రాలను ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాష, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అస్లాం పాల్గొన్నారు.

# పెరుగుతున్న తాగునీటి సమస్య

ఐదురోజులకు కానీ సరఫరా లేదు ● ఆందోళనబాటలో మహిళలు



బద్వేలు రూరల్, జూన్ 16 : బద్వేలు మున్సిపల్ పరిధిలో 35 వార్డుల్లో దాదాపు లక్ష మందకి పైగా జనాబా ఉన్నారు. 22వేల పక్కాగృహాలు అధికారికంగా ఉండగా మరో ఐదారు వేల గృహాలు అనధికారికంగా ఉన్నాయి. మున్సిపాలిటీలో నీటి సరఫరా గతంలో రోజూ లేక రోజు మార్చి రోజు సరఫరా అవుతుండేది. ఇటీవల బ్రహ్మం సాగర్‌లో నీరు లేవన్న కారణంగా మూడురోజులకొకమారు తాగునీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ అధికారులు అధికారికంగానే ప్రకటన చేశారు. అయితే మూడురోజులు దాటి ఐదురోజుల వరకు నీటిని సరఫరా చేయలేకపోవడం పై పట్టణంలోని మహిళలు, ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలతో ఆందోళనబాట పట్టనున్నారు.

**గతంలో ఉన్న మోటర్లన్నీ బంద్..:** బ్రహ్మంసాగర్ నీటిని పైపులైను ద్వారా తరలించకముందు బద్వేలు పట్టణంలో దాదాపు పూలబావి వద్ద ఒక మోటరు, మొండిశ్ల వద్ద ఒక మోటరు, దిగువ బ్రాహ్మణవీధి వద్ద ఒక మోటరు ఇలా నాలుగైదు మోటార్ల వద్ద నీటి సరఫరా జరుగుతుండేది. అయితే 110 కోట్ల రూపాయలు వెచ్చించి బ్రహ్మంసాగర్ నీటిని బద్వేలుకు తరలించేందకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, అప్పటి నుంచి ఉన్న పాత మోటారు బావులన్నింటినీ కట్ చేశారు. కేవలం బ్రహ్మంసాగర్‌నీటి మీదనే ఆధారపడి తాగునీరు అందిస్తున్నారు.

**బ్రహ్మంసాగర్ నుంచి రోజూ 75లక్షల లీటర్లు..:** బ్రహ్మంసాగర్ నుంచి పట్టణంలో ఏర్పాటు చేసిన దాదాపు 9 ఓవర్ హెడ్ ట్యాంకులకు 75 లక్షల లీటర్ల నీరు గతంలో సరఫరా జరుగుతుండేది. అయితే పోను పోను బ్రహ్మంసాగర్‌లో నీరు తక్కువైన కారణంగా 20 లక్షల లీటర్ల నీటిని కూడా బ్రహ్మంసాగర్ నుంచి రప్పించే పరిస్థితి లేదు. దీంతో ఐదురోజులకొకమారు కూడా తాగునీటిని సరఫరా చేయలేకుండా ఉన్నారు.తాగునీటిని సరఫరా చేయడంలో మున్సిపల్ అధికారులు వైఫల్యం చెందారని మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు వేసవి కాలంలో నీటి ఎద్దడి ఏర్పడ్డట్లుగా మున్సిపల్ పరిధిలో తాగనీటి సమస్య ఏర్పడిందని ఐదురోజులకు కూడా తాగునీటి సరఫరా జరగకపోతే తాగునీరు, నిత్యావసరాల పనులు ఎలా జరుగుతాయని మున్సిపల్ అధికారులు వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి తాగునీటి సరఫరా రోజువారి జరిగే ట్లు చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు



చెట్టులో నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు

జమ్మలమడుగు, జూన్ 16: జమ్మలమడుగు - ప్రొద్దుటూరు రోడ్డులో విద్యుత్తు తీగలు చెట్లలో ముళ్ల తీగల మధ్య ఉన్నాయి. ఇటీవల భారీగా గాలులు వీచడంతో పది రోజుల క్రితం పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోయాయి. అయితే విద్యుత్తు అధికారులు ఇలాంటి చెట్ల మధ్య ముళ్ల పొదల్లో విద్యుత్తు తీగలు ఉన్నచోట చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే విద్యుత్తు షాక్‌కు గురయ్యే అవకాశం ఉందని ఆ ప్రాంతంలో ప్రజలు తెలియజేస్తున్నారు. అలాగే మరికొన్ని చోట్ల ఇంటి మిద్దెలపై తీగలు ఉన్నాయని తెలియజేశారు.



## పుట్టా గెలుపుతో బి.మఠానికి పాదయాత్ర



మైదుకూరు, జూన్ 16 : పుట్టా సుధాకర్ యాదవ్ ఎమ్మెల్యేగానూ, పుట్టా మహేష్ యాదవ్ ఏలూరు ఎంపీగాను గెలుపొందడంపై వారి అభిమానులు ఆదివారం స్థానిక పెద్దమ్మతల్లి ఆలయంనుంచి బీమఠంలోని బ్రహ్మంగారి ఆలయం వరకు పాదయాత్రను చేపట్టారు. ఈ పాదయాత్రను టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు ప్రారం భించారు. పాదయాత్ర చేపట్టిన వారిలో రామిశెట్టి వెంకట రమణ, చెన్నయ్య తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల సుబ్బరాయుడు, బెల్లం బుజ్జి, బండి తిరుమలేష్ తదితరులున్నారు. కాగా పుట్టా గెలుపుపై తిరుమలకు శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు భీమయ్య, నాయకుడు కిషోర్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం ఒంటిమిట్టకు చేరుకుంది. ఈ పాదయాత్రకు గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ ఏపీ రవీంద్ర వారి పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

## ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం



పోరుమామిళ్ల, జూన్ 16 : ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్లెక్సీకి టీడీపీ జిల్లా కార్యదర్శి మురళీక్రి ష్ణయాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఆదివారం పోరుమామిళ్లలోని రామచంద్ర రిక్రియేషన్ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద బాణసంచా పేల్చి పాలాభిషేకం చేసి కార్యకర్తలు, నాయకులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నరసింహయాదవ్, గురయ్యయాదవ్, చంద్రయ్యయాదవ్, శ్రీనివాస యాదవ్,రామసుబ్బయ్యయాదవ్, కిశోర్‌యాదవ్ పాల్గొన్నారు.

## కవలకుంట్లలో చెరువు ఆక్రమణ

అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

పోరుమామిళ్ల, జూన్ 16 :మండలంలోని కవలకుంట్ల చెరువులో కొందరు ఆక్రమణలకు ప్రయత్నించగా విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వాటిని నిలుపుదల చేశారు. ఆదివారం మండలంలోని కవలకుంట్ల చెరువు సర్వే నెంబరు 1002లో 53 ఎకరాల విస్తీర్ణం ఉండడంతో అందులో రెండున్నర ఎకరాలలో కొందరు ఆదివారం చదను చేసి ఆక్రమణకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు తహసీల్దారు శిరీష దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఆదేశాల మేరకు ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో నారాయణ పనులు నిలిపివేశారు. భూమిని ఆక్రమించుకున్న వ్యక్తి తనకు కోర్టు ఆర్డరు ఉందని, అందుకే సాగు చేసుకుంటున్నానన్నారు. ఆధారాలు ఏమైనా ఉంటే కార్యాలయానికి వచ్చి సమర్పించాలని అంత వరకు పనులు నిలుపుదల చేయాలని ఆదేశించడంతో తాత్కాలికంగా ఆ పనులు ఆక్రమణలకు తెర పడింది.

## హాస్టల్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం

బద్వేలు, జూన్ 16: పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం దాతల ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1000లు నగదుతో పాటు మహనీయుల ఫొటో జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. అనంతరం ఎంఈవో చెన్నయ్య, హాస్టల్ వెల్ఫేర్ అధికారి ప్రసాద్, జగదీశంలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ గురుమూర్తి , గోప వరం ఎంఈవో చెన్నయ్య, వైవీయూ పాలకమండలి సభ్యులు కొండ పల్లి చిన్నసుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల స్వామి,సుబ్బరాయుడు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణ యాదవ్, ఆర్యవైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు కే.వి.సుబ్బారావు, పట్టణ అభివృద్ధి కమిటీ కన్వీనర్ నానబాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జీవో నెం.117ను రద్దు చేయాలి

పోరుమామిళ్ల, జూన్ 16 : ప్రాధమిక పాఠశాలలో 3,4,5 తరగతులు వేరు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానిక వీలు కల్పించిన జీవోనెం.117 రద్దు చేసి ప్రాధమిక పాఠశాలలను బలోపేతంచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జోనల్ కార్యవర్గసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చే సిన జీవో 117 వల్ల మొత్తం ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్తంగా గందరగోళంగా తయారైందన్నారు. సీఎం హామీ ఇచ్చిన విధంగా ఆ జీవో రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు క్రిష్టారెడ్డి, గురయ్య, భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బాలజోజి, అబ్దుల్ సత్తార్, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, ఆదిశేషారెడ్డి , పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బికోడూరు, బి.మఠం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

కాశినాయన,జూన్ 16: రాష్ట్రంలో టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని ఈరాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టాలని మొక్కుకున్న టీడీపీ నాయకులు తమ మొక్కులను జ్యోతి క్షేత్రంలో తీర్చుకున్నారు. టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు జ్యోతిక్షేత్రంలోని కాశిరెడ్డి నాయన పాలరాతి సమాధివద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు క్లస్టర్ ఇన్‌చార్జి ఎం.విజయ్‌కుమార్‌రెడ్డి, డి.క్రిష్టారెడ్డి, ఓ.రోహిత్ రెడ్డి, క్రిష్ణయ్య, నర్శిరెడ్డి, కే.నరసింహారెడ్డి, చెన్నారెడ్డి, ఏ.రమణారెడ్డి, డి.వెంకటేష్, పి.వెంకటరెడ్డి,హుసేన్‌పీరా పాల్గొన్నారు.

**ఖాజీపేట..:** టీడీపీ ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ విజయం సాధిస్తే అంకాళమ్మ దగ్గర 101 టెంకాయలు కొడుతానని రావులపల్లె పంచాయతీ పాటిమీదపల్లె గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగార్జునయాదవ్, రెడ్యం రమణారెడ్డి, దాసరి బాలకృష్ణయాదవ్, దాసరి శ్రీను యాదవ్, ఆర్ల హరి, గంగాధర్, ఆవుల సుబ్బరాయుడు, బత్తల మల్లికార్జున, గంగయ్య, కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి అభినందనలు తెలిపిన టీడీపీ నాయకులు



మంత్రిని కలిసిన రితీశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు

అట్లూరు, జూన్ 16 : ఏపీ దేవదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆనం రామనారాయణరెడ్డిని అట్లూరు మండల టీడీపీ నాయకులు ఆదివారం నెల్లూరులో ఆయన నివాసంలో కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బద్వేలు యువ నాయకుడు రితీష్‌రెడ్డి, మండల టీడీపీ సీనియర్ నాయకులు మంచూరి సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మండల ఎంపీపీ ఇన్‌ఛార్జ్ పోతిరెడ్డి రెడ్డయ్య, పాలకొండు రామచంద్రారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేషన్‌షాపు డీలర్లకు బిల్లులు చెల్లించాలి



నంద్యాల వరదరాజులరెడ్డిని సత్కరిస్తున్న రేషన్‌షాపు డీలర్లు

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 16: రేషన్‌షాపు డీలర్లకు గతంలో బకాయి ఉన్న మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ సెంటర్ల బిల్లులను త్వరగా చెల్లించాలని రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన నంద్యాల వరదరాజులరెడ్డిని రేషన్‌షాపు డీలర్లు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రేషన్‌షాపు డీలర్లు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసిన స్టార్ ఫౌండేషన్ సభ్యులు..:** ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన నంద్యాల వరదరాజులరెడ్డిని స్టార్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజుద్దీన్‌తో పాటు సభ్యులంతా కలిశారు. ఆదివారం మండల పరిధిలోని కామనూరులో వరదరాజులరెడ్డి స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సభ్యుడు ఆర్‌వీ చలపతి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే వరదను కలిసిన మార్కెట్ వ్యాపారులు..:** ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ అసోసియేషన్ మాజీ నాయకుడు జొన్నవరం షబ్బీర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కామనూరులోని ఆయన స్వగృహంలో వ్యాపారులు కలిశారు.

## ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసిన ఎస్ఐ



బ్రహ్మంగారిమఠం, జూన్ 16 : మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఆదివారం ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే నివాసంలో బి.మఠం ఎస్ఐ విద్యాసాగర్ కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాధరెడ్డి కూడా ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



బద్వేలు రూరల్, జూన్ 16 :రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ,న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఆదివారం నంద్యాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి పూలమాల, శాలువా, మక్కా మదీన చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో జహంగీర్‌బాష, ట్రావెల్స్ రసూల్, కంభం శివానందరెడ్డి షేక్ ముస్తాఫా, మహబూబ్‌బాషా, రఫి తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా పోలేరమ్మ, పోతులరాజుకు బోనాలు



ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిన జనం

అట్లూరు, జూన్ 16 : మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో పోలేరమ్మ పోతురాజుకు ఆదివారం గ్రామస్థులు వైభవంగా బోనాలు, పొంగులు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో భక్తులు కూడా దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ప్రాంగణమంతా జనాలతో కిక్కిరిసింది. ఎస్ఐ కేసీరాజు తమ సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాటూరు రాధాక్రిష్టారెడ్డి, చిలిపి క్రిష్టారెడ్డి, అరవ పెద్ద రామసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగం నర్సారెడ్డి, కొండ్రెడ్డి, పెంచల్‌రెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# కోవర్టులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

తెలుగుదేశం పార్టీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్నటీడీపీ నేతలు

పోరుమామిళ్ల, జూన్ 16 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీలో ఉన్నట్లుగా ఉండి పరోక్షంగా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించినవెన్ను పోటు దారులు టీడీపీ అధికారంలోకి రావడానికి తాము రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసినట్లు ఫోజులు కొట్టి మంత్రులతో జిల్లా అధ్యక్షులను కలిసి పుష్పగుచ్ఛాలు ఇవ్వడం సన్మానాలు చేస్తున్న వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుని పార్టీ నుంచి బహిష్కారం చేయాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రంతు, చెరుకూరి చెన్నరాయుడు, మురుకూటి గుర్విరెడ్డి, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుస్సేన్, కొండారామక్రిష్టారెడ్డి, మురళీక్రిష్ణ, మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల టీడీపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాశినాయన మండలం నరసాపురానికి చెందిన కర్నాటి వెంకటరెడ్డి ఎన్నికల ముందు రోజు ఎవరికీ ప్రచారం చేయకుండా రాత్రికి రాత్రేవైసీపీ వారితో కుమ్మక్కై వారికి అనుకూలంగా వ్యవహరించారన్నారు. ఎన్నికల ముందు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రితీష్‌రెడ్డిని విమర్శలు చేశారన్నారు. కలసపాడు మండలం ఎగువ రామాపురానికి చెందిన ప్రహ్లాదరెడ్డి, సింగరాయపల్లె, తంబళ్లపల్లె పోలింగ్ బూత్‌లలో వైసీపీ వారికి అనుకూలంగా వ్యవహరించారన్నారు. సీఎంకు కూడా వీరిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయనపల్లె రమణారెడ్డి, సీతాబాలాజీ, దాదన భూపాల్‌రెడ్డి, గొంటువారిపల్లె గుర్విరెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, టీడీపీ జిల్లా కార్యదర్శి మురళీక్రిష్ణ, విజయభాస్కర్‌రెడ్డి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.